ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :100 బుధవారం ఫిబ్రవరి 4 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## రాష్ట్రంలో పెరుగుతున్న...



# వీధి కుక్కల బెడద

- రెండేళ్ల బాలుడిపై దాడి
- హైదరాబాద్ నార్సింగి సర్కిల్‌లో కలకలం
- ఇంటి ముందు ఆడుకుంటుండగానే కుక్కల దాడి
- నిలోఫర్ ఆసుపత్రికి చిన్నారి తరలింపు
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి):రాష్ట్రవ్యాప్తంగా వీధి కుక్కల బెడదపై ఆందోళన పెరుగుతున్న వేళ, హైదరాబాద్ నగరంలో మరో భయానక ఘటన చోటుచేసుకుంది. నార్సింగి సర్కిల్ పరిధిలో ఇంటి ముందు ఆడుకుంటున్న ప్రభాకర్ అనే వ్యక్తి రెండేళ్ల కుమారుడిపై వీధి కుక్కలు అకస్మాత్తుగా దాడి చేశాయి. చిన్నారి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగెత్తుకొచ్చినా అప్పటికే తీవ్ర గాయాలు అయ్యాయి.కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు హుటాహుటిన నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి చికిత్స పొందుతున్నట్లు సమాచారం. చిన్న వయసులోనే ఇలాంటి ఘటన జరగడం తల్లిదండ్రుల్లో తీవ్ర భయాన్ని, ఆవేదనను కలిగిస్తోంది.నార్సింగి ప్రాంతంలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని, పిల్లలు బయట ఆడాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. గతంలోనే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా, ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్న ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల భద్రతపై ప్రభుత్వ బాధ్యతను ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. పిల్లలు, వృద్ధుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రైతు నేస్తం...
# 82వ ఎపిసోడ్ విజయవంతం




- సమగ్రప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన
- నానో యూరియా వినియోగం, యాసంగి వరి తెగుళ్ల నియంత్రణపై చర్చ
- సీజన్‌వారీ కార్యక్రమాలు విస్తరించాలన్న మంత్రి ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం 82వ ఎపిసోడ్ మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లైవ్ ప్రసార రూపంలో నిర్వహించిన ఈ ఎపిసోడ్‌కు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ

2

# పార్లమెంట్‌లో మాట్లాడనివ్వడం లేదు
# రాహుల్ గాంధీ



- ంండో రోజూ ప్రతిపక్ష నేతకు అవకాశం నిరాకరణ
- డాక్యుమెంట్లు చూపించినా గొంతు నొక్కివేత ఆరోపణ
- సత్యాన్ని చెప్పడాన్ని భయపడుతున్న ప్రభుత్వం
- ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణన

2

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్

- మెట్‌పల్లి మండలం బండ లింగపూర్‌లో పరిశీలన
- ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- ధరల నియంత్రణకు కమిటీ ఏర్పాటు సూచన
- గడువులోపు లక్ష్యాల పూర్తి పై ఆదేశాలు

మెట్‌పల్లి,(మనప్రజాప్రతినిధి): మంగళవారం మెట్‌పల్లి మండలం బండ లింగపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి లబ్ధిదారునికి తెలంగాణ ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ వంటి

2

# వైసీపీ నేతల ఇళ్ల దాడులపై...
# పోలీసులకు దేవినేని అవినాష్ ఫిర్యాదు

- టీటీడీ లడ్డు ప్రసాదంపై అసత్య ప్రచారాలపై ఆగ్రహం



విజయవాడ, ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి): వైసీపీ నేతల ఇళ్లపై జరిగిన దాడులు, టీటీడీ లడ్డు ప్రసాదంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అవాస్తవాలు ప్రచారం చేశారని ఆరోపించారు. సీబీఐ నివేదికలో నిజాలు బయటపడ్డాయని, కూటమి నేతలు చెప్పిందంతా పచ్చి అబద్ధమని ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు.

2

# రైతుల హక్కుల పరిరక్షణే
# కూటమి ప్రభుత్వ లక్ష్యం

- చంద్రగిరిలో 'మీ భూమిమీ హక్కు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని



చంద్రగిరి, ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి):కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం, శ్రేయస్సుతో పాటు రాష్ట్ర అభివృద్ధి కూడా అత్యంత ముఖ్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. చంద్రగిరి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'మీ భూమిమీ హక్కు' రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ పార్టీ ప్రచారానికి ఉపయోగించుకున్నారని విమర్శించారు. రెవెన్యూ వ్యవస్థను సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుతూ, రైతుల పాస్‌పుస్తకాలపై వైసీపీ నేతల ఫొటోలతో ప్రచారం చేయడం దురదృష్టకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇబ్బందికరంగా మారిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసిన

2

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మెదటి పేజీ తరువాయి

నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణ కోసం కమిటీ ఏర్పాటు చేసి, లబ్ధిదారులకు అనుకూలంగా ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఎక్కడైనా వెనుకబడినట్లయితే వెంటనే వేగం పెంచాలని ఆదేశించారు. అధికారులకు కేటాయించిన లక్ష్యాలను గడువులోపు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఇళ్ల నిర్మాణం జరగాలని, లబ్ధిదారులు అవసరమైన మేస్త్రీలు, కార్మికులను ముందుగానే ఏర్పాటు చేసుకుని నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఆర్థిక సమస్యలు ఎదురైతే ఐకేపీ సహకార సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దశలవారీగా బిల్లుల చెల్లింపులు ఆధార్‌కు అనుసంధానమైన లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని వివరించారు. అనంతరం మార్కింగ్, బేస్మెంట్, స్లాబ్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేయాలని వారికి సూచించారు.



# వైసీపీ నేతల ఇళ్ల దాడులపై పోలీసులకు దేవినేని అవినాష్ ఫిర్యాదు

మెదటి పేజీ తరువాయి

▶ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా దాడులు టీటీడీ లడ్డు వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన కూటమి నేతలు ప్రజల దృష్టి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని దేవినేని అవినాష్ ఆరోపించారు. అందులో భాగంగానే మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి జరిగిందని, టీడీపీ నేతలు కర్రలు, రాడ్లతో దాడులకు పాల్పడ్డారని చెప్పారు. మహిళలు ఉన్న ఇళ్లను కూడా చూడకుండా తగలబెట్టడం అత్యంత దారుణమని విమర్శించారు. అలాగే మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై కూడా అన్యాయంగా దాడి జరిగిందని, ఈ ఘటనలు నారా లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలోనే జరిగాయని ఆరోపించారు. పోలీసుల వైఖరిపై తీవ్ర విమర్శలువిజయవాడలో పెట్రోల్ బాంబుల సంస్కృతి తీసుకొచ్చారని, పోలీసులు టీడీపీ గుండాలతో మంతనాలు జరిపి దాడులకు సహకరించారని దేవినేని అవినాష్ ఆరోపించారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని, ఆదివారం రౌడీషీటర్ల కౌన్సెలింగ్ పేరుతో దాడులకు ప్రోత్సహించారని విమర్శించారు. నిజంగా చట్టపాలన ఉంటే దాడి చేసిన వారిని నడిరోడ్డుపై అరెస్ట్ చేసి చూపించాలని డిమాండ్ చేశారు. టీటీడీ లడ్డు ప్రసాదంపై అసత్యాలు ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన కోరారు



# రైతు నేస్తం 82వ ఎపిసోడ్ విజయవంతం

మెదటి పేజీ తరువాయి

సందర్భంగా సమగ్ర వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయ విధానాలు, నానో యూరియా వినియోగం మరియు దాని ప్రయోజనాలు, యాసంగి వరి పంటలో పురుగులుతెగుళ్ల సమగ్ర యాజమాన్యం వంటి కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక సాగు పద్ధతులతో పాటు ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచుకునే మార్గాలను నిపుణులు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న సాగు సమస్యలను నేరుగా వెల్లడించారు. వాటికి సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచనలు చేస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని సీజన్‌వారీగా మరింత విస్తరించాలని, ఎక్కువ మంది రైతులు పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతులకు ఉపయోగకరమైన సమాచారం నిరంతరం అందించడమే రైతు నేస్తం కార్యక్రమ లక్ష్యమని అధికారులు తెలిపారు.




# రైతుల హక్కుల పరిరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మెదటి పేజీ తరువాయి

ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని ఎమ్మెల్యే గుర్తుచేశారు. స్వర్ణ నారావారిపల్లి పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైన తర్వాత స్వర్ణ చంద్రగిరి ప్రతిపాదనలను ప్రభుత్వంకు పంపినట్లు తెలిపారు

▶ రీసర్వేతో భూ వివాదాలకు ముగింపు

తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని చంద్రగిరి మండలంలో ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించామని, ఇందులో భాగంగా రెడ్డివారిపల్లిలో రీసర్వే పూర్తి చేసి 40 మంది రైతులకు రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా రైతుల భూ వివరాలు పరిశీలించి, సరిచూసిన తర్వాత పాస్‌పుస్తకాలను అందజేయడం విశేషం. రీసర్వే ద్వారా భూ వివాదాలు పూర్తిగా తొలగిపోతాయని, రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు లభిస్తాయని పులివర్తి నాని భరోసా ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను రైతులకు అందిస్తోందని స్పష్టం చేశారు. రైతులు క్షేత్రస్థాయిలో తమ భూముల వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.

▶ రైతుల హర్షం

పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే పులివర్తి నానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మోహన్, తహసీల్దార్ శివరామ సుబ్బయ్యతో పాటు జిల్లా, మండల స్థాయి రెవెన్యూ అధికారులు, రైతులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు.



# పార్లమెంట్‌లో మాట్లాడనివ్వడం లేదు రాహుల్ గాంధీ

మెదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి): లోక్‌సభలో ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా పాలక పక్షం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నాయకుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. అన్ని డాక్యుమెంట్లను ధృవీకరించి చూపించినప్పటికీ రెండో రోజూ తనకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఒక్కే అజెండాతో పనిచేస్తోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తాను మాట్లాడితే ప్రధాని వైఫల్యాలు, అసమర్థత బయటపడతాయన్న భయంతోనే తన గొంతు నొక్కుతున్నారని అన్నారు. ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వకుండా అడ్డుకోవడమే పాలక పక్షం ప్రధాన లక్ష్యంగా మారిందని విమర్శించారు. ప్రతి సమావేశంలోనూ ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్‌లో ప్రభుత్వ చర్యలను ప్రశ్నిస్తే వారిని సస్పెండ్ చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇది పార్లమెంట్‌ను బుల్డోజ్ చేయడమేనని, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న చర్యగా అభివర్ణించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వరం వినిపించకుండా చేయడం ద్వారా సభ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. అయితే ఇలాంటి చర్యలు తమను వెనక్కి నెట్టలేవని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అధికారాన్ని ప్రశ్నించడం, ప్రజలకు నిజాలను చెప్పడం తమ బాధ్యతని పేర్కొన్నారు. ఈ పాలన పూర్తిగా రాజీపడిన పాలనగా మారిందని ప్రజల ముందే ఎండగడతామని, సత్యాన్ని చెప్పడం ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.




# మన్రేగా చట్టాన్ని పునరుద్ధరించాలి వైఎస్ షర్మిల

- అనంతపురం జిల్లాలో కొనసాగిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర
- ఐదుకల్లు గ్రామంలో రచ్చబండ, గ్రామస్థుల డిమాండ్
- మన్రేగా గ్రామాల అభివృద్ధికి వెన్నెముకగా నిలిచింది
- కేంద్రం కుట్రలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తాం



అనంతపురం, ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ (మన్రేగా) చట్ట పరిరక్షణ యాత్ర రెండో రోజు కూడా అనంతపురం జిల్లాలో కొనసాగింది. కళ్యాణదుర్గం నియోజకవర్గం ఐదుకల్లు గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మన్రేగా చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రచ్చబండలో మాట్లాడిన గ్రామస్థులు, 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో ప్రారంభమైన ఉపాధి హామీ పథకం తమ జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని, వలసలు తగ్గాయని పేర్కొన్నారు. అలాంటి చట్టాన్ని బలహీనపరచే ప్రయత్నాలు దారుణమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ, మన్రేగా చట్టం గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచిందని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పక్కన పెట్టి కొత్త చట్టాల పేరుతో కేంద్ర ప్రభుత్వం కరువు పనులపై కుట్రలు చేస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రజల హక్కులను కాలరాసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు. మన్రేగా పరిరక్షణ పోరాటానికి ఐదుకల్లు గ్రామస్థులు ముక్తకంఠంతో మద్దతు ప్రకటించడం కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూర్చిందని షర్మిల అన్నారు. ఉపాధి హామీ చట్టం పూర్తి స్థాయిలో అమలయ్యే వరకు, గ్రామీణ పేదలకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.



# రాయలసీమ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

ఆలూరు, ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి): రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నచూపు చూస్తున్నారని ఆలూరు వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తీవ్ర ఆరోపణలు చేశారు. కర్నూల్ జిల్లా ఆలూరు మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాయలసీమను పూర్తిగా విస్మరించారని విమర్శించిన బుసినే విరుపాక్షి, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. అసెంబ్లీలో ఈ అంశాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తావించినా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్క మంత్రి కూడా ఖండించకపోవడం దారుణమని అన్నారు. రాయలసీమ ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులపై స్పష్టమైన వైఖరి లేకపోవడం వల్ల ప్రాంత అభివృద్ధి నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న చలో పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



- చంద్రబాబుపై ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తీవ్ర విమర్శలు



# హుస్నాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున మంత్రి ప్రచారం


- డోర్ టు డోర్ ప్రచారంలో పాల్గొన్న మంత్రి
- ప్రజాపాలన ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరణ
- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

హుస్నాబాద్, ఫిబ్రవరి 3 (మనప్రజాప్రతినిధి): హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో 8వ వార్డులో కాశవేణి సరిత సాంబరాజు, 18వ వార్డులో బుడగ జంగాల కాలనీలో అయిలేని అనితా రెడ్డి, 9వ వార్డులో అభ్యర్థి రాజయ్యలకు మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డోర్ టు డోర్ ప్రచారం చేపట్టి ప్రజలను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను



# పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మనప్రజాప్రతినిధి //ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలం లొద్దల కాగితాపల్లి గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలు స్థానిక ఎమ్మెల్యే కూనరవికుమార్ ఈ రోజు రైతులకు అందజేశారు . రైతులకు భూమిపై హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అని అన్నారు. రైతులకు భూమి సంబంధించిన ఎదుర్కొన్న సమస్యలు ఏళ్ల తరబడి ఉన్నటువంటి ఇబ్బందులను ఈ పట్టాదార్ ఈ పాస్ పుస్తకాల ద్వారా శాశ్వత పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వశీలో భూ సర్వే సరిగ్గా జరగకపోవడం వలన భూ వివాదాలు, రికార్డుల లోపాల వల్ల అనేక మంది రైతులు నష్టపోయారని, వాటిని సరిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. భూమి హక్కులు కేవలం పత్రాలు కాదు రైతుకు భరోసా, భవిష్యత్తుకు భద్రత అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యం గారు మండల అధ్యక్షులు అంబాలా రాంబాబు గారు,స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు కార్యకర్తలు,రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ భూమిపై స్పష్టమైన హక్కులు కల్పించినందుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ గారికి , ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపారు.



**లొద్దల కాగితపల్లి గ్రామంలో భూమి యాజమాన్య హక్కుపత్రం రాజ ముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్**

# మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

జలుమూరు: ఫిబ్రవరి 3(ప్రజాప్రతినిధి):శ్రీముఖలింగేశ్వర స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (వ్రా) గారి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం నేపథ్యంలో, నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బగ్గు రమణమూర్తి కీలక ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను అత్యంత వైభవంగా, విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముఖ్యమైన వివరాలు: ఉత్సవాల తేదీలు: ఫిబ్రవరి 15 నుండి 18 వరకు ఉత్సవాలు జరుగుతాయి.ఫిబ్రవరి 15: మహా శివరాత్రి.ఫిబ్రవరి 18: వంశధార నది వద్ద చక్రతీర్థ స్నానాలు (సుమారు 60,000 మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది). దర్శన ఏర్పాట్లు : భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉచిత దర్శనంతో పాటు, ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు , షామియానాలు ఏర్పాటు. నిరంతరాయంగా తాగునీరు మరియు చంటిపిల్లల కోసం పాలు పంపిణీ.ఉచిత ప్రసాదంతో పాటు పులిహోర, లడ్డు విక్రయ కౌంటర్లు.దేవస్థానం పరిసరాల్లో 4 చోట్ల మెడికల్ క్యాంపులు, నిరంతర పారిశుధ్య పనులు మరియు తగినన్ని టాయిలెట్ల ఏర్పాటు.సీసీ కెమెరాల పర్యవేక్షణ, మరియు భారీ పోలీస్ బందోబస్తు.భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సుల ఏర్పాటు.నరసన్నపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ, "దక్షిణ కాశిగా పిలవబడే శ్రీముఖలింగేశ్వర క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడికి స్వామి వారి దర్శనం సులభంగా జరిగేలా చూడాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని" అధికారులను కోరారు.




**-భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను అత్యంత వైభవంగా, విజయవంతం చేయాలి.**

# పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి

(ప్రజాప్రతినిధి//ఫిబ్రవరి 3):దౌల్తాబాద్ మండలములోని పాఠశాలలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండల పరిధిలోని ఉప్పర్ పల్లి గువ్వలేగి గోవిందాపూర్ పోసాన్ పల్లి కోనాయిపల్లి దీపాయంపల్లి గొడుగుపల్లి మల్లేశం పల్లి పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. ఈ తనిఖీలో భాగంగా ఫౌండేషనల్ లీటరసీ స్టడీ ఖీూా జాతీయస్థాయి సర్వే 3వ తరగతి సంబంధించిన పరీక్ష కోసం విద్యార్థులను ఏ విధంగా సంసిద్ధులుగా చేస్తున్నారో పరిశీలించడం జరిగింది . నల్లబల్లపై విద్యార్థులకు ఆంగ్లం మరియు గణితం సంబంధించిన పాఠాలను గణిత సమస్యలను విద్యార్థులతో చేయించడం జరిగింది. వెనుకబడిన విద్యార్థుల పైన ప్రత్యేక శ్రద్ధ చూపి అందరికీ మాదిరి పరీక్షలు నిర్వహించి జాతీయస్థాయి పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులుగా చేయాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో పరిశుభ్రతగా అదేవిధంగా పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని సూచించారు గోవిందప్ప ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ పరిశీలించడం జరిగింది ప్రశంసించడం జరిగింది. అదేవిధంగా గొడుగుపల్లి పాఠశాలలో విద్యార్థులను తెలుగు ఆంగ్లం చదివించడం జరిగింది. ప్రతి పాఠశాలలో 5.0 తూచా తప్పకుండా నిర్వహించాలని సూచించడం జరిగింది. పాఠశాలలో ఉన్నటువంటి షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రిమెట్రిక్ స్కాలర్షిప్స్ అందరూ దరఖాస్తు చేసుకోవడానికి ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు. వివిధ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతి గదుల నిర్వహణను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గజ్జల కనకరాజు వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూప్ సాగర్, రజిత, మాధురి బాల్ రెడ్డి ఉమారాణి మమత . మౌనిక. ఉపాధ్యాయులు. దేవి సింగ్ సిఆర్పిలు రాజు చంద్రమౌళి పాల్గొన్నారు.



# పోస్టర్ బ్యాలెట్ వినియోగించుకోవాలి...

(మనప్రజాప్రతినిధి //సూర్యాపేట :జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వి.సి హాల్ నందు జిల్లాలో ని మున్సిపల్ కమీషనర్లు, ఆర్డీవోలు, తాసిల్దార్లతో మున్సిపల్ ఎన్నికల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7,8,9 తేదీలలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్లలో సంబంధిత మున్సిపాలిటీకి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించు కోవాలని, అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసిన తదుపరి సాధారణ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదని, కావున అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ అన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

# బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

**-పన్నెండుకు పన్నెండు వార్డులు బిఆర్ఎస్ గెలుస్తుంది**

**-చేర్యాల మున్సిపల్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ దే**

**-జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**


**సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**

మనప్రజాప్రతినిధి//చేర్యాల:జనగామ నియోజకవర్గం, చేర్యాల,మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పదకొండు అలయన్స్ లో భాగంగా సిపిఎం కు ఒక వార్డు, తరపున బరిలో ఉన్న అభ్యర్థులనుగెలిపించేందుకు కారు గుర్తుపై ఓటేయాలని అలాగే సుత్తి కొడవలి గుర్తుపై ఓటేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓటర్లను కోరారు.మంగళవారం చేర్యాల మున్సిపాలిటీలోని 1,2,3,10,11,12 వార్డులల్లో కార్యకర్తలతో కలిసి ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చేర్యాల మున్సిపాలిటీని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం మీటరు సీసీ రోడ్లను వేయలేదని అన్నారు. నాలుగు వేల రూపాయల పింఛను ఇస్తానని ఇవ్వలేదని,సంక్షేమ పథకాలు,ఇస్తామని చెప్పి ప్రజలను మభ్య పెట్టారని అన్నారు.గత పది ఏళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి తమ అభ్యర్థులను గెలిపిస్తుందని అన్నారు.పార్టీ అభ్యర్థుల విజయం కోసం బిఆర్ఎస్ నాయ కులు,కార్య కర్తలు,కృషి చేయాలని పిలుపునిచ్చారు.సిపిఎం సిద్ధిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే సీపీఎం పార్టీ అభ్యర్థి ముస్త్యాల లావణ్య-ప్రభాకర్ లను గెలిపించాలని కోరారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో,సిపిఎం,బిఆర్ఎస్ పార్టీల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మలపల్లి లీల సంజీవులు ని గెలిపించండి

మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల,జనగామ:జనగామనియోజకవర్గం,చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తుమ్మలపల్లి లీల సంజీవులు ని అత్యధిక ఓట్లతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించిన కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్.ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తుందని,ప్రజా సమస్యలను నేరుగా అర్థం చేసుకొని పరిష్కరించే నాయకత్వం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన పేర్కొన్నారు..కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి భారీ మెజారిటీతో గెలిపిస్తే,పదవ వార్డులో ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు,డ్రైనేజీ, తాగునీరు,వీధి దీపాలు,వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ,ప్రతి వార్డు అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని,పదవ వార్డు ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు అయిన చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మలపల్లి లీల సంజీవులు ను గెలిపించి,అభివృద్ధికి భాగస్వాములు కావాలని మహదేవుని శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి శ్రీనివాస్,సార్ల లింగం ముదిరాజ్,బొచ్చు ఎల్లయ్య యాదవ్,ఏర్పుల రాజు, ఉప్పల వంశీ కృష్ణ,ఈగ కనకరాజు,రుద్రారం దుర్గయ్య,చింతల రమేష్ మరియు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



**-చేర్యాల పదవ వార్డ్ అభ్యర్థి తుమ్మలపల్లి లీల సంజీవులు ని గెలిపించండి మహదేవుని శ్రీనివాస్**


# తిరుపతి జిల్లాలో బాలిక కిడ్నాప్ కలకలం....

ప్రజాప్రతినిధి//తిరుపతి జిల్లా :- తిరుపతి నందు జరిగిన విద్యార్థి నాయకుల కిడ్నాప్ ను తీవ్రంగా తీసుకున్న జిల్లా యస్పీ శ్రీ సుబ్బరాయుడు, ఐపీఎస్., సంఘటన జరిగిన వెంటనే అడిషనల్ యస్పీ శ్రీ రవి మనోహర చారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు. గంట వ్యవధి లో కిడ్నాప్ కాబడిన విదార్థి సంఘం నాయకులు అక్బర్ మరియు వినోద్ లను రక్షించిన పోలీసులు. కిడ్నాప్ చేసిన వారి తో పాటు వాహనాలు కూడా అదుపులోకి తీసుకొన్న పోలీసులు. కిడ్నాప్ చేసిన వారితో పాటు చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సమగ్రమైన దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు. చట్టాన్ని చేతిలోకి తీసుకొవాలని ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు.



# ఇందిరమ్మ ఇళ్లను సందర్శించిన హౌసింగ్ ఎండి విపి గౌతమ్

సదాశివపేట(మనప్రజాప్రతినిధి) :ఆరూరు గ్రామపంచాయతీ పరిధిలో షేర్ వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను హౌసింగ్ ఎండి సందర్శించారు ఆరుర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన షేర్ వాల్ ఇండ్లు ప్రభుత్వం నిర్దేశించిన ఐదు లక్షలలోనే పూర్తిచేసి నిరుపేదలకు ఇల్లు నిర్మించ నిర్మించి ఇవ్వడం అవుతుంది... ఇట్టి అవకాశాన్ని లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని వారు గ్రామ ప్రజలకు సూచించారు ఇట్టి కార్యక్రమన్ని ఉద్దేశించి గ్రామ ప్రథమ పౌరురాలు శ్రీ శ్రీమతి నాయికోటి లావణ్య-మధు, మాట్లాడుతూ హౌసింగ్ ఎండ్ ఆరుర్ రావటం చాలా సంతోషం... వారి సలహాలు సూచనలతో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం అని అన్నారు...పిడి చలపతిరావు, ఆర్డీవో జనర్దన్ గారు,ఎంపీడీవో కే, లక్ష్మి, ఎమ్మార్వో బాలరాజ్ సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, డి మాధవ రెడ్డి,ఏ హౌసింగ్ రేష్మ, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ గౌడ్, ఉప సర్పంచ్ విట్టల్ మాజీ సర్పంచ్ మధు, , గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# 140 ఏండ్ల కాంగ్రెస్ పార్టీని రియల్ ఎస్టేట్ సంస్థగా భావిస్తున్న కొమ్మూరి

## -సీనియర్ నాయకులకు కనీస గౌరవం ఇవ్వని కొమ్మూరి వైఖరిపై ధ్వజం
## -ఆవగింజంత ఆత్మగౌరవం,చీమకాలంత రోషం ఉన్న ఏ కార్యకర్తయినా ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడు
## -చేర్యాల మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల జనగామ:జనగామ నియోజకవర్గం,నూట నలభై ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి తన రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చి ఇష్టరాజ్యంగా వ్యవహారిస్తున్నాడని చేర్యాల మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్,కొమ్మూరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం చేర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి గెలుపు కోసం తన శక్తిని యుక్తిని అనుభవాన్ని వృత్తిని సైతం దారబోసి ఆయన గెలుపు కోసం తీవ్రమైన కృషి చేశానని అన్నారు.అయినప్పటికీ కూడా దురదృష్టవశాత్తు ఓటమినిఎదుర్కొన్నారు.ఆయన ఓటమిని జీర్ణించుకోలేక తీవ్ర మనస్థాపానికి గురైన విషయం ఆయనకు కూడా తెలుసన్నారు. గత రెండు సంవత్సరాల నుండి ఆయన నుండి మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తన నలభై సంవత్సరాల రాజకీయ జీవన ప్రస్థానంలో తాను ఎప్పుడు కూడా ఇంత నిర్జీవంగా,నిస్క్రియ, అచేతనంగా ఎన్నడూ లేనని అన్నారు.పది సంవత్సరాలపాటు స్వర్గీయ మాజీమంత్రి నిమ్మ రాజారెడ్డి, మండల శ్రీరాములు, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డితో సైతం కలిసి విభేదించి కూడా పనిచేశారని గుర్తు చేశారు.ఇన్నేళ్ల రాజకీయ ప్రస్థానంలో తాను ఎలాంటి అవమానాలకు గురి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంత జరిగినప్పటికీ ఆత్మ గౌరవాన్ని చంపుకొని పని చేయడానికి ప్రధాన కారణం ఏమిటంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో రావడం, ప్రతాప్ రెడ్డి నియోజకవర్గ ఇంచార్జి, డీసీసీ అధ్యక్షుడు కావడం ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని భావించి అంతకుమించి తప్పకుండా చేర్యాలను రెవెన్యూ డివిజన్ కోసం కృషి చేస్తాడని దృఢమైన నమ్మకంతోటే ఇంతకాలం వేచి చూశానని,అభివృద్ధిని ఆటుకెక్కించి,రెవెన్యూ డివిజన్ అంశాన్ని తుంగలో తొక్కి ఈ రెండేళ్ల పాలనలో చేర్యాల ప్రాంతానికి ప్రతాప్ రెడ్డి ద్వారా వీసమెత్తు పని కూడా జరగలేదని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ తనకు ఇచ్చిన అధికారాన్ని అవకాశాలను ఓటేయ్యని ప్రజల మీద ఈ ప్రాంతం మీద కక్ష తీర్చుకుంటున్నాడు తప్ప అభివృద్ధి కోసం ఏమాత్రం ఆలోచన చేయడం లేదని విమర్శించారు.ఈ రెండేళ్ల నుండి గడ్డి గంగల పోతే ఏంది.. వడ్లు వాగులో పోతే ఏంది.నన్ను ఓడించిన ప్రజలు,నన్ను గెలిపించలేని కాంగ్రెస్ పార్టీ ఎడబోతే నాకేంది అన్న చందంగా వ్యవహరిస్తున్నాడన్నారు.ఆవగింజంత ఆత్మగౌరవం,చీమ కాలంత రోషం ఉన్న ఏ కార్యకర్తల అయినా ఏ మనిషి అయినా చివరికి ఆయన ఇంట్లో పని చేసే పనిమనిషి అయినా పట్టుమని పది రోజులు కూడా ఉండలేరని, రాజకీయాలలో గెలుపు ఓటమి అత్యంత సహజమని,కానీ కేపీఆర్ కు ఓటమిని సమీక్షించే ధైర్యం కానీ రాజకీయ విజ్ఞత కూడా ఆయనలో మచ్చుకైన లేదని అన్నారు.గెలిస్తే ఆయన గొప్పతనం ఓడితే ప్రజల తెలివితక్కువ తనం అని భావించే మనస్తత్వం అయనదని అన్నారు.యావత్ తెలంగాణలో నాటి నుండి రెడ్డి సామాజిక వర్గానిదే రాజకీయ ఆధిపత్యం అని జనమెరిగిన సత్యం. ఒకసారి రెడ్డి సామాజిక వర్గం ఎన్నికల్లో ఓడిపోతే రెండవసారి రెట్టింపు పౌరుషంతో పదునైన ప్రణాళికతో ఎన్నికల బరిలో నిలబడి పద్యర్థులను మట్టి కనిపిస్తూ విజయభావుట ఎగురవేస్తారని అన్నారు.తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గానికి అనువైన రాజకీయ పరిస్థితులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు ఏ సామాజిక వర్గానికైనా లేవని,అంతేకాకుండా ప్రతాప్ రెడ్డికి అర్థ బలం, హంగబలం పుష్కలంగా ఉన్నప్పటికీ కూడా వరుస ఓటములు జరుగుతున్నప్పటికీ కూడా ఎందుకు సమీక్ష చేసుకోలేకపోతున్నారో నియోజకవర్గ ప్రజలకు అంతుపట్టడం లేదని అన్నారు.పైపెచ్చు తన ఓటమికి ద్వితీయ శ్రేణి నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను చివరికి ప్రజలను సైతం భాద్యులని నిత్యం దూషిస్తూ అవమాన పరుస్తున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. తాను మట్టి బిడ్డను వృత్తి రీత్యా ఒక డాక్టర్ ను నలభై సంవత్సరాల నుండి ప్రజలతో ప్రజా సమస్యలతో మమేకమై జీవనం సాగిస్తున్నాను. దానికి తోడు రెండు పర్యాయాలు ఎంపీపీగా చేర్యాలకు ప్రాతినిధ్యం వహించిన వ్యక్తిగా రెండుసార్లు వరంగల్ ఎంపీగా పోటీ చేసిన వ్యక్తిగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నప్పటికీ జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో అన్ని సీట్లు కాకపోయినా కనీసం దళిత రిజర్వుడు సీట్లలోనైనా అభ్యర్థులు ఎవరు ఉండాలి అనే అంశాన్ని కూడా తమ దృష్టికి తీసుకురాకుండా కనీసం మర్యాద ఇవ్వకుండా అవమానపరిచాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీగా పని చేసిన కాలంలో రెండు సందర్భాల్లో సర్పంచ్ ఎన్నికల్లో స్వర్గీయ అవుశర్ల ఆంజనేయులు, ఆముదాల జయప్రద ల పార్టీ తరఫున అభ్యర్థుల ఎంపిక సందర్భంలోనూ వారి గెలుపునూ నాదేనని ప్రధానమైన పాత్ర అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈయన పనిచేయడం కంటే ఈయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం కంటే బండెడు రాళ్లు కట్టుకొని బావిలో దూకడం మేలని ఆవేదన వెలిబుచ్చారు. ఇంకా ఎంతో కాలం మౌనంగా ఉండలేనని, భజనపరుడిగా అంతకన్నా ఉండలేనని ఇంకా మౌనంగా ఉంటే ఈ ప్రాంతానికి మరింత నష్టం జరుగుతుందన్నటువంటి ఆలోచనతోనే ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ప్రతాప్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని తన సొంత రియల్ ఎస్టేట్ సంస్థ,జేబు సంస్థలాగా మార్చాడని,తాను తలుచుకుంటే అందలం లేకుంటే పాతాళం అనే చందంగా వ్యవహరిస్తున్నాడని, తాను ఓడిపోయానని కక్ష తోటి పార్టీని, నియోజకవర్గంలో ఓట్లేసిన ప్రజలను కూడా నిర్లక్ష్యం చేస్తూ ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నాడని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.తక్షణమే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి కాయకల్ప చికిత్స చేయకుంటే పార్టీ మనుగడకే కష్టమని తెలియజేశారు.

# 17 18 వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థులు కామిల్ ఎండి లతీఫ్ వార్డులో సమావేశం



సదాశివాపేట ఫిబ్రవరి 3 ( మన ప్రజా ప్రతినిధి ):17 18 వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థులు కామిల్ ఎండి లతీఫ్ వార్డులో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎన్నికల అబ్జర్వర్ మటన్ బిక్షపతి, బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు చింత సాయినాథ్ రావడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17, 18 వ వార్డు అభ్యర్థులను గెలిపించి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు వీరిని గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. వార్డు అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సహకారంతోనే సాధ్యమవుతుందన్నారు. అభ్యర్థులు ఎండి లతీఫ్, కామెల్ మాట్లాడుతూ కౌన్సిలర్ లాగా మమ్మల్ని గెలిపించినట్లయితే 24 గంటలు అందుబాటులో ఉంటామని ప్రజాసేవ చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు కోడూరు అంజయ్య, సలావుద్దీన్, నర్సింలు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# కొమరవెల్లి దేవాలయ ఏఈఓ గంగా శ్రీనివాస్ బదిలీ



మన ప్రజాప్రతినిధి దినపత్రిక,కొమరవెల్లి,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజక వర్గం,కొముంరవెల్లి దేవాలయంలో ఏఈఓ గా విధులు నిర్వహిస్తున్న గంగా శ్రీనివాస్,బదిలీపై బాసర దేవాలయం కు వెళుతున్న సందర్భంగా దేవస్థాన కార్యనిర్వాహణాధికారి డిప్యూటీ కమిషనర్ టంకాశాల వెంకటేష్,వారిని శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీ అనేది సర్వ సాధారణమైన విషయమని దేవాదాయశాఖ కమిషనర్,ఉత్తర్వుల మేరకు అతని మాతృ సంస్థ అయిన జ్ఞాన సరస్వతి దేవస్థానం బాసర కు బదిలీ అయినందున డ్యూటీ నుండి రిలీవ్ చేయడం జరిగిందని తెలిపారు.2019వ సంవత్సరం నుండి ఈ దేవాలయంలో ఏఈఓ గా విధులు ఇప్పటివరకు నిర్వహించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్,జూనియర్ అసిస్టెంట్ శంకర్, మధుకర్,కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, సిద్దయ్య,తదితరులు ఉన్నారు.

# కామ్రేడ్ కొంగరి నారాయణ స్మారక విజ్ఞాన సేవా కేంద్రాన్ని నిలబెడదాం

## -అరాచకవాదుల ఆగడాలను ఎదుర్కొందాం..
## -కొంగరి వెంకట మావో. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల జనగామ: జనగామ నియోజకవర్గం, చేర్యాల మండలం,ముస్త్యాల గ్రామానికి చెందిన కామ్రేడ్ కొంగరి నారాయణ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఇతని పేరున గతంలో స్మారక భవనాన్ని నిర్మించాలని సంకల్పం చేయడం జరిగింది.ఈ స్మారక కేంద్రం ఆధారంగా అనేక సేవా కార్యక్రమాలు గ్రామంలో జరుగుతున్నాయని గొప్ప పేరు గల కామ్రేడ్ కొంగరీ నారాయణ స్మారక విజ్ఞాన సేవా కేంద్రం స్థలంలో 2008 సంవత్సరంలో అప్పటి గ్రామపంచాయతీ పాలక కమిటీ గ్రామ కంఠంలో రెండు వందల యాభై గజముల ఖాళీ స్థలాన్ని కేటాయిస్తు తీర్మానం చేసి స్థలాన్ని చూపించడం జరిగింది. ఆ స్థలంలో భవన నిర్మాణానికి పర్మిషన్ మరియు నల్లా కనెక్షన్ కు పరిమిషన్లు గ్రామపంచాయతీ ద్వారా తీసుకోవడం జరిగింది.అందులో నిర్మాణము ప్రారంభించిన పిదప కొన్ని అనివార్య కారణాలవల్ల నిర్మాణాన్ని కొనసాగించ లేకపోయాం కామ్రేడ్ కొంగరి నారాయణ స్మారక విజ్ఞాన సేవా సంఘం ట్రస్ట్ పేరున గత పద్దెనమీది,సంవత్సరాలుగా గ్రామంలో చలివేంద్రం ఏర్పాట్లు, ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ను ప్రోత్సహించే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.దీనిని ముస్త్యాల గ్రామంలోని కొంతమంది గిట్టని వారు వాస్తవ విషయాలను పక్కనపెట్టి దీనిపై దుష్ప్రచారం చేస్తూ భూముల ఆక్రమణ చేస్తున్నారని కబ్జాలు చేస్తున్నారని ప్రజలను రెచ్చగొట్టే విధంగా వాట్సాప్ మెసేజ్ లు వాట్సాప్ వాయిస్ చేస్తు సోమవారం రోజున ఈ స్థలంలోని కాంపౌండ్ పలకలను ధ్వంసం చేయడం తమ హద్దు మీరి ప్రవర్తించడం సరైంది కాదని ఇది గ్రామంలో అరాచకానికి దారితీస్తుందని దీనిని సిపిఎం పార్టీ పూర్తిస్థాయిలో ఖండిస్తున్నామని ఈ నిర్మాణాన్ని కూల్చేసిన వారు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మేదలాలని లేనిపక్షంలో వారు చేసే దౌర్జన్యాలను, అరాచకాలను సాగనివ్వకుండా అరాచకవాదులకు అడ్డు తగలాల్సి వస్తుందని ఈ అరాచకవాదులు నేర చరిత గలవారు లిక్కర్ దందాలు,సిట్టింగులు, నిర్వహిస్తూ గ్రామ ప్రజలను నిత్యం తప్పుదోవ పట్టిస్తున్నారని భూ ఆక్రమణలు వారే చేసి ఇతరులను ఏలెత్తి చూపుతు గురువింద చందంలో గ్రామంలో చలామణి అవుతున్నారని వీరి దౌర్జన్యాలను తిప్పి కొట్టాల్సిన అవసరం ముస్త్యాల గ్రామ ప్రజలపై,సిపిఎం పార్టీ కార్యకర్తలపై ఉందని రాబోయే రోజుల్లో వారు అర్థం చేసుకొని వారి ప్రవర్తనను మార్చు కోకపోతే వారిపై పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించడం జరిగింది.ప్రస్తుతం కామ్రేడ్ కొంగరీ నారాయణ స్మారక విజ్ఞాన సేవా సంఘం ట్రస్టు భవన స్థలము కేవలం కొంగరి వెంకట మావో సొంతం కాదని ఇది ప్రజలందరికి ఉపయోగపపడే విధంగా ఉంటుందనిఈ ట్రస్టు ద్వారా రాబోయే రోజుల్లో గ్రామ ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి దోహదపడుతుందని ఇందులో ట్రస్ట్ భవనాన్ని నిర్మించడానికి అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు రేపాక కుమార్ గ్రామ కమిటీ కార్యదర్శులు ఎండి ఎజాస్,గుండ్ర రవీందర్, పార్టీ సభ్యులు తరిగొప్పుల సహదేవులు,యాదారం బ్రహ్మయ్య,చింతకింది డానియల్,తదితరులు పాల్గొన్నారు.



# తీర్థాల జాతరకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలి...



మనప్రజాప్రతినిధి//ఖమ్మం జిల్లా: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఫిబ్రవరి 14 నుంచి ఫిబ్రవరి 18 వరకు 5 రోజుల పాటు మహాశివరాత్రి తీర్థాల జాతర నిర్వహణ పారిశుధ్య నిర్వహణను ప్రాధాన్యతగా తీసుకోవాలి భక్తుల కోసం అవసరమైన మేర సహాయక కేంద్రాలు ఏర్పాటు మహాశివరాత్రి సందర్భంగా తీర్థాలలో నిర్వహించు జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఖమ్మంఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా జాతర నిర్వహణకు విస్తృతంగా ఏర్పాటు చేయాలని, ప్రణాళిక ప్రకారం నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని తన చాంబర్ లో మంగళవారం తీర్థాల మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఫిబ్రవరి 14 నుంచి ఫిబ్రవరి 18 వరకు 5 రోజుల పాటు మహా శివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా తీర్థాలలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధ మయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి మహాశివరాత్రి సందర్భంగా దాదాపు నాలుగు లక్షల మంది భక్తులు ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల గ్రామంలో ఉన్న సంగమేశ్వర స్వామి దేవాలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకునే అవకాశం ఉందని, గతం కంటే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.అవసరమైన మేర పారిశుధ్య కార్మికులను నియమించి ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను నిరంతరాయంగా శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్య కార్మికులకు డ్రెస్ కోడ్ ఉండాలని, మండల పంచాయతీ అధికారి పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షించాలని కలెక్టర్ అన్నారు. తగినంత బ్లీచింగ్ అందుబాటులో ఉంచాలన్నారు. జాతర సమయంలో, జాతర తర్వాత పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అన్నారు.జాతర సందర్భంగా ఉన్న 30 టాయిలెట్స్ బ్లాకులను రన్నింగ్ వాటర్ తో సహా అందుబాటులో ఉంచాలని, నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. తీర్థాల దేవాలయం వద్ద ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు.భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా అవసరమైన మేర బస్సుల సంఖ్య పెంచాలని, రద్దీగా ఉండే రూట్లలో అదనంగా బస్సులు నడపాలన్నారు. దేవస్థానం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, స్నాన ఘట్టాల వద్ద రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ ద్వారా భక్తులకు త్రాగునీటి వసతి కల్పించాలని కలెక్టర్ సూచించారు. జాతర సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 4 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి వైద్య శిబిరంలో వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బందినీ సరిపోను ఓఆర్ఎస్, అత్యవసర మందులతో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. రెండు 108 వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఫైర్ ఇంజన్ కావాల్సిన పరికరాలు, సిబ్బందితో జాతరలో అందుబాటులో ఉంచాలన్నారు.పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. అన్ని శాఖల అధికారులు సిబ్బంది సహాయ సహకారంతో విధులు నిర్వహించాలని, భక్తులకు ఇబ్బందులు కలకుండా అవసరమైన మేర సైన్ బోర్డులు, ఎంట్రీ, ఎగ్జిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారుఅన్ని శాఖల అధికారులతో కంట్రోల్ రూం ఏర్పాటుచేయాలని, తప్పిపోయిన, భక్తులకు సూచనలకు మంచి పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటుచేయాలని అన్నారు. మహాశివరాత్రి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జాతరలో వసతుల కల్పనకు కలెక్టరేట్ నుండి 10 లక్షల రూపాయల చెక్కును ఆలయ ఏవో కు కలెక్టర్ అందజేశారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, తీర్థాల ఆలయ ఏవో కె. వేణుగోపాల్, విద్యుత్ డి ఇ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఏడవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోతుగంటి ప్రసాద్ ముమ్మర ప్రచారం



మనప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజక వర్గం: జనగామ నియోజకవర్గం,కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,ఆదేశాల మేరకు మంగళవారం రోజున చేర్యాల లో ఏడవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోతుగంటి ప్రసాద్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని,కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ చేర్యాల ప్రాంత ప్రజల సమస్యలను ప్రాంతా అభివృద్ధి కోసం పాటుపడుతానని, అధికార పార్టీకి ఓటు వేసి అభివృద్ధిని చేసుకుందామని పోతుగంటి ప్రసాద్, అన్నారు.ఏడవ వార్డులో గడపగడప ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయడం జరిగింది.ఏడవ వార్డ్ ప్రజలు ప్రసాద్ కి బ్రహ్మరథం పట్టారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పూర్మ ఆగం రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ జక్కుల తిరుపతి, పిఎసిఎస్ చైర్మన్ మెర్గుకృష్ణ,వెలగల మల్లేశం,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బంధీగ రాకేష్ కృష్ణన్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు,కాశెట్టి ఉపేందర్,పచిమడ్ల వెంకటయ్య,తదితరులు పాల్గొన్నారు.

# రెండవ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ముస్త్యాల తేజ సంజీవులు విజయం ఖాయం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రోజున చేర్యాల లో రెండవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముస్త్యాల తేజ సంజీవులు ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.ఈ సందర్భంగా తేజ సంజీవులు,మాట్లాడుతూ చేర్యాల ప్రాంత ప్రజల సమస్యలను ప్రాంతా అభివృద్ధిని,సిద్దిపేట జిల్లాలోనే ముందు ఉంచుతామని,అధికార పార్టీకి ఓటు వేసి అభివృద్ధిని చేసుకుందామని ముస్త్యాల తేజ సంజీవులు అన్నారు, రెండో వార్డులో గడపగడప ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆగంరెడ్డి మాట్లాడుతూ రెండో వార్డ్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముస్త్యాల తేజ సంజీవులు కి బ్రహ్మరథం పట్టారన్నారు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలే మా అభ్యర్థులను గెలిపిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పూర్మ ఆగం రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ జక్కుల తిరుపతి,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,బంధీగ రాకేష్ కృష్ణన్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు,చెవిటి లింగం,ముస్త్యాల కిష్టయ్య,రంగుశంకర్, జంగానీ రవి,పర్వతం చంద్రయ్యా,అవుశెర్ల యాదయ్య,మిట్టపల్లి నర్సిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# వాహన పత్రాలను తనిఖీ చేస్తున్న సీఐ,ఎస్ ఐ



మనప్రజాప్రతినిధి//ఖమ్మం జిల్లా కారేపల్లి:అన్ని రకాల ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు -వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలి వాహనాలను అకస్మిక తనిఖీ చేసిన పోలీసులుసింగరేణి సీఐ నునావత్ సాగర్ వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలతో వాహనాలను నడపాలని అలాగే ఇప్పటికే వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలని సింగరేణి సీఐ నునావత్ సాగర్ అన్నారు.మంగళవారం సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ లో సింగరేణి సీఐ నునావత్ సాగర్,ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో అన్ని రకాల వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఇసుక తరలిస్తున్న లారీలను తనిఖీ చేయగా ఇప్పటికే పెండింగ్ లో ఉన్న చాలానాలను సంబంధిత లారీ యజమానులచే కట్టించారు. ఈ సందర్భంగా సిఐ సాగర్ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్ తో పాటు ఆర్ సి,పొల్యూషన్ దృవపత్రాలు బండి వెంట ఉంచుకోవాలని డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా డ్రైవర్ వద్ద ఉండాలన్నారు.ఎలాంటి దృపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సంబంధిత వాహనాన్ని సీజ్ చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి ఎస్సై బైరు గోపి,పోలీస్ సిబ్బంది శంకర్,శ్రీకాంత్,కిరణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పులి సంచరిస్తున్న ప్రదేశాలలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు

మనప్రజాప్రతినిధి//యాదగిరిగుట్ట:జిల్లాలోని కొన్ని గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.మంగళ వారం రాజాపేట మండలం బసంతాపూర్ గ్రామంలో నిన్న రాత్రి పులి దాడిలో మృతి చెందిన లేగ దూడ సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఇటీవల గ్రామాలలో పులి సంచరిస్తున్నందున పులిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నాల పై అటవీ అధికారులతో కలెక్టర్ చర్చించారు.అటవీ అధికారులు పులిని పట్టుకోవడానికి థర్మల్ డ్రోన్ ను ఉపయోగించి పులి సంచరిస్తున్న ప్రదేశాలను వీడియో తీయడం ,ట్రాప్ కెమెరా, పులిని బంధించడానికి



బోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అటవీ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు.ప్రత్యేకంగా అడవి ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని తెలిపారు.రాత్రి వేళలో పశువులను బయటికి వదలకుండా పశువుల పాకలో వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు.పులి కనిపించినట్లు గమనించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు లేదా స్థానిక గ్రామ పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు.వాటి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయరాదని అన్నారు.జిల్లా యంత్రాంగం మరియు అటవీ శాఖ సిబ్బంది పులి అడుగు జాడలను గమనిస్తూ , దాని పట్టుకోవడానికి, అడవిలోకి పంపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు భయాందోళన నకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాధితుల వద్దే కేసు నమోదు ఎఫ్ ఐ ఆర్ ఎట్ డోర్ స్టెప్



మనప్రజాప్రతినిధి//సూర్యాపేట జిల్లా:సూర్యాపేట టౌన్‌రోడ్డు ప్రమాద ఘటనపై బాధితుల వద్దే ఎఫ్ ఆర్ ఐ నమోదు చేసిన సూర్యాపేట 2 వ పట్టణ పోలీసులు.బాలెంల గ్రామానికి చెందిన దొంతర బోయిన వెంకన్న కుటుంబ సభ్యులతో కలిసి ఆటో లో ప్రయాణిస్తుండగా సూర్యాపేట పట్టణం లో జాతీయ రహదారిపై కొత్త వ్యవసాయ మార్కెట్ కు వెళ్ళే జంక్షన్ వద్ద ఆటో-కారు రోడ్డు ప్రమాదం జరిగి గాయాలైనాయి. అంబులెన్స్ ద్వారా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగినది. దీనిపై డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న సూర్యాపేట 2 వ పట్టణ ఎస్సై శివ తేజ పోలీసు సిబ్బందితో కలిసి సంఘట స్థలం పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్ళి వారి నుండి పిర్యాదు స్వీకరించి పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఆదేశాల మేరకు ఎస్సై శివ తేజ అక్కడే ఎఫ్ ఐఆర్ నమోదు చేయడం జరిగినదని. ఎఫ్ఐఆర్ ప్రతిని బాధితులకు అందజేయడం జరిగినది. ఈ రోడ్డు ప్రమాద ఘటనలో వెంకన్నతో సహా 4 గురు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. ఇంటివద్ద నుండే ఎఫ్ఐఆర్ కార్యక్రమం ద్వారా బాధితులకు సత్వర పోలీసు సేవలు అందిస్తున్నాము అని ఎస్సై శివతేజ తెలిపినారు.

# మున్సిపాలిటీ ఎన్నికల భద్రతపై రాష్ట్ర డీజీపీ వీడియో కాన్ఫిరెన్స్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యపేట జిల్లా:సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం మున్సిపల్ ఎన్నికల చట్టాలపై పోలీసు అధికారులకు లీగల్ అవగాహనసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా నేపథ్యంలో మున్సిపాలిటీ ఎన్నికల భద్రతపై రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ జిల్లాలోని పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎన్నికలను పూర్తి శాంతియుతంగా, స్వచ్ఛంగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకు ప్రతి స్థాయి పోలీసు అధికారి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని డీజీపీ ఆదేశించారు. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని పని చేయాలని గత ఎన్నికల్లో నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగార్స్ ను ముందస్తు బైండోవర్ చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాన కలిగి ఉండాలని, ఎన్నికల రోజు మరియు కౌంటింగ్ రోజున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. విజేత ర్యాలీలపై ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం తీసుకుంటున్న చర్యలు, భద్రత పరమైన అంశాల గురించి, బందోబస్తు ఏర్పాట్లు గురించి, పోలింగ్ సామాగ్రి భద్రత, స్ట్రాంగ్ రూమ్ ల భద్రత, గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడ్డ వారిపై చర్యలు, ప్రలోబాల నివారణ, చెక్ పోస్ట్ లలో తనిఖీల గురించి ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు వివరించారు. మద్యం అమ్మకాలు పై నిఘా ఉంచి కేసులు నమోదు చేసినట్లు తెలిపినారు, నామినేషన్ దశ నుంచి పోలింగ్, కౌంటింగ్, ఫలితాల అనంతరం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహణకు అనుమతులు ఇవ్వడంలేదు అని, భానాసంచా, డీజే లపై నిషేదం ఉన్నదని తెలిపినారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడీ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సీఐలు వెంకటయ్య, రామారావు, ఎలక్షన్స్ సెల్ ఎస్ఐ లు రాంబాబు, అనిల్ రెడ్డి, పోలీస్ ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మోడల్ బాలికల హాస్టల్‌లో ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మనప్రజాప్రతినిధి//చేగుంట, ఫిబ్రవరి 03:చేగుంట మండల పరిధిలోని వడియారం తెలంగాణ మోడల్ గర్ల్స్ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు హాస్టల్ ఇన్‌ఛార్జ్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత : అభ్యర్థులు ఏఎన్ఎం కోర్సు లేదా బి.ఎస్సి నర్సింగ్ పూర్తి చేసి ఉండాలి.దరఖాస్తు విధానం: ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా హాస్టల్ కార్యాలయంలో సంప్రదించవచ్చు లేదా ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.చివరి తేదీ: దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 08, 2026 ఆఖరి తేదీగా నిర్ణయించారు.అర్హత కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం హాస్టల్ వార్డెన్ స్వాతిని 6300981605 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.




# చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ట కు భూమి పూజ




మనప్రజాప్రతినిధి//చేగుంట పిబ్రవరి 03:మరాఠా వీరుడు సామ్రాజ స్థాపకుడు చత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణం కోసం మంగళ వారం పొలంపల్లి గ్రామం లో, మెదక్ ఎంపీ రఘునందన్ రావు చొరవతో భూమి పూజ చేసిన గ్రామస్తులు,, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చత్రపతి శివాజీ (1630బి1680)మరాఠా సామ్రాజ్య స్థాపకుడు భారతదేశ చరిత్రలో ఒక గొప్ప యోధుడు,అతను మరాఠా సామ్రాజ్యనీ స్థాపించి,మొగల్ సామ్రాజానికి వ్యతిరేకంగా పోరాడి,భారతదేశంలో హిందూ రాజ్యని స్థాపించాడు, బాల్యం, విద్య,శివాజీ 1645 లో, తన తండ్రి నుండి స్వతంత్రుడై,తన సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు,శివాజీ తన సైనిక నైపుణ్యం వ్యూహాలతో మొగల్ సామ్రాజానికి వ్యతిరేకంగా పోరాడి,అనేక విజయాలు సాధించాడు, వారి విజయాలు 1659 : ప్రతాప్ గాడ్ యుద్ధంలో మొగల్ సేనాని అఫ్జల్ కన్ ను ఓడించాడు,1665 : పురందర్ సంది కుదుర్చుకున్నాడు,1674 : రాజ్యాభిషేకం చేసుకొని, చత్రపతి (ఇంపీరియల్ టైటిల్) అనే బిరుదును స్వీకరించాడు,శివాజీ మరణం 1680 ఏప్రిల్ 3న రాజ్ గడ్ కోటలో మరణించాడు, వారు చేసిన సేవలకు గుర్తుగా విగ్రహ నిర్మాణం చేయడం జరిగిందని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో,, శ్రీరామ్ సభ్యులు,అంబేద్కర్ యూత్ సభ్యులు, స్నేహ యూత్ సభ్యులు, శివాజీ యూత్ సభ్యులు, హనుమాన్ యూత్ సభ్యులు, బజరంగ్ దళ్ యూత్ సభ్యులు, ఆదర్శ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

# బచ్చన్నపేట ప్రజల రోడ్డు సమస్యపై మార్కెట్ కమిటీ చైర్మన్ చొరవ...

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజక వర్గం, బచ్చన్నపేట పట్టణ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న గుంతల రోడ్డు సమస్యకు చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత వెంకన్న చొరవతో పరిష్కారం దిశగా అడుగు పడింది. పట్టణంలో గుంతల మయంగా మారిన రోడ్డును తక్షణమే మరమ్మత్తు చేయాలని జాతీయ రహదారి విభాగం డీఈతో ప్రత్యక్షంగా చర్చించారు.ప్రజలకు జరుగుతున్న ఇబ్బందులు,రోడ్డు కారణంగా జరుగుతున్న ప్రమాదాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన చైర్మన్ శ్వేత వెంకన్న వినతికి స్పందించిన ఎన్.హెచ్ డీఈ,పది రోజుల లోపు రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మత్తు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ,అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారాలు సాధిస్తున్న చైర్మన్ శ్వేత వెంకన్న ప్రయత్నాలను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. రోడ్డు మరమ్మత్తులు పూర్తయితే ప్రయాణికులు, వ్యాపారులు,వాహన దారులకు ఎంతో ఊరట కలగనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు



రోడ్డుకు పది రోజుల్లో పరిష్కారం